క్లుప్తంగా

డివిజన్ స్థాయి స్పందనకు ఎనిమిది అర్జీలు

ఆర్డీఓ సీతారామారావు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. శ్మశాన వాటికను ఆనుకున్న ఆక్రమణలు తొలగించాలని, భూ తగాదాలను పరిష్కరించాలని, సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించానని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యన్నారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో పాటు ఏకాదశి పర్వదినం, పిల్లలకు సెలవులను పురస్కరించుకొని తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి అభిషేకం, తొలి పూజలు చేశారు. తొలి పూజను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో చేశారు. వాటిని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లతో పాటు ఉప ఆలయాలోని దేవాతా మూర్తులకు అలంకరణలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టుబోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్ర సంబరం



గోలివారి కొత్తూరులోని వీరభద్ర సంబరంలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలో గోలి వారి కొత్తూరులో సోమవారం వీరభద్ర సంబరం భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రతీ ఏడాది నిర్వహించే సంబర కార్యక్రమంలో భాగంగా సోమవారం కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యంశెట్టి మహాలక్ష్మి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు అమలకంటి వెంకటలక్ష్మి, అచ్చంపేట సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, గ్రామ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేగంగా నాడు- నేడు పనులు



పీబీ దేవంలో నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న డీవైఈఓ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని కాకినాడ ఉప విద్యాశాఖాధికారి డానియేల్‌రాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని పీబీ దేవం జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో జరుగుతున్న నేడు-నేడు పనులను పరిశీలించారు. అదే విధంగా 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెచ్ఎం డి.మల్లేశ్వరరావు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసలు రంగు ఇది

- రంగు వచ్చేందుకు మామిడిపై రసాయనాలు
- మగ్గబెట్టేందుకు కార్బైడ్ వాడకం
- ఆరోగ్యానికి హానికరం



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

కొత్తపల్లి: తియ్యని ఫలం మామిడి.. వీటి రుచే వేరు.. అందుకే ఈ మధుర ఫలాన్ని ఇష్టపడని వారుండరు.. ఎండాకాలంలో విరివిగా దొరికే ఈ ఫలాలకు ఎనలేని గిరాకీ ఉంటోంది.. వీటి రంగు చూసి కొనేందుకు అందరూ ఉత్సుకత చూపుతుంటారు.. ఆకర్షణీయంగా మంచి పక్వానికి వచ్చినట్లు కనిపించే ఈ ఫలాన్ని కొందరు చర్యలతో హానికారకంగా మార్చుతున్నారు. కొంతమంది మామిడి వ్యాపారులు హానికర రసాయనాలు వాడుతూ మామిడి పండ్లను మగ్గబెడుతున్నారు. పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి మామిడి పండ్లను తినడంతో కేన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడి తలనొప్పి, దీర్ఘకాలిక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 1,827 ఎకరాల్లో మామిడి పంట సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు 1,700, పిఠాపురం 47, కొత్తపల్లి 80 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఈ ఏడాది ఎకరానికి 2 నుంచి 3 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మామిడి పండ్లను మాగబెట్టడంలో కొందరు రైతులు సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఎగుమతులకు అనువుగా మాగబెడితే మంచి లాభాలు ఆర్జించడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన పండ్లను అందించవచ్చు.

చూసీచూడనట్లు వదిలేయడంతో..

మామిడి తోటల నుంచి వ్యాపారులు మామిడికాయలను తీసుకువచ్చి నిషేధిత రసాయనాలను వాడుతూ పండ్లను మగ్గపెడున్నారు. మార్కెట్లోకి రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు విచ్చలవిడిగా వస్తున్నా ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ మాత్రం కొరవడింది. వారు చూసీచూడనట్లు వదిలేయడంతో పరిస్థితి దాదాపు చేయిదాటింది. మామిడి కాయలపై కాల్షియం కార్బైడ్ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇది వాడితే ఆహార భద్రత అధికారులు కేసులు నమోదు చేయవచ్చు. అయితే అదెక్కడా జరగడం లేదు. ఇటువంటి మామిడి పండ్లు తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రసాయనాలు పూసిన మామిడి పండ్లు తింటే నాలుక, పెదవులు మొద్దుబారినట్లు అనిపిస్తాయి. ఇలా అనిపిస్తే అటువంటి పండ్లను తినవద్దని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

సహజంగా మగ్గబెట్టాలి



ఆరోగ్యకరమైన మామిడి పండ్ల ఉత్పత్తికి రైతులు, వ్యాపారులు సహకరించాలి. కాల్షియం కార్బైడ్‌కు బదులుగా ఇథలిన్ గ్యాస్ చాలా తక్కువ హానికరమైంది. అయితే రైతులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సహజంగా మగ్గబెట్టిన మామిడి పండ్లనే విక్రయించాలి.

–అరుణ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి

రంగు చూసి మోసపోవద్దు



రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక రోగాలు వస్తాయి. అలాంటి మామిడి పండ్లను తీసుకున్న వారికి గ్యాస్ట్రిక్ సమస్యలు, విరోచనాలు, వాంతులే కాకుండా మనిషి పూర్తిగా నీరసించిపోయే ప్రమాదం ఉంది. రంగులు చూసి ప్రజలు మోసపోవద్దు.

–మౌనిక, వైద్యాధికారి, కొత్తపల్లి ఆరోగ్యకేంద్రం

నేడు విజయవాడకు ఉచిత బస్సు

సామర్లకోట: రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర శతకుండాత్మక(108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞానికి స్థానిక పంచారామ క్షేత్రంలో నుంచి మంగళవారం ఉదయం ఏడు గంటలకు ఉచిత బస్సు బయలుదేరుతుందని ఈఓ డి. నాగమల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ యజ్ఞాన్ని భక్తులు అందరూ తిలకించాలనే లక్ష్యంతో దేవదాయ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ యజ్ఞంకు హాజరు అయ్యే భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను దేవదాయశాఖ ఏర్పాటు చేస్తుందన్నారు. విజయవాడ వెళ్లాలనుకొనే భక్తులు ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్దకు రావాలన్నారు.

వర్గీకరణ ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దాం

పెద్దాపురం: ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేద్దామని, ఉద్యమంలో మాదిగలంతా ఏకతాటి పైకి వచ్చి మాదిగలు సత్తా చాటాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాడ నూకరాజు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో సోమవారం ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు అరసాడ హరిబాబు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూకరాజు మాదిగ మాట్లాడుతూ మాదిగ జాతి గొప్పతనాన్ని చాటుతూ మాదిగ సోదరులంతా ఏకం కావాలన్నారు. వర్గీకరణ సాధించే వరకు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా పెద్దాపురం డివిజన్ అధ్యక్షుడిగా అరసాడ హరిబాబు మాదిగను ఎన్నుకున్నారు. కాకినాడ జిల్లా కార్యదర్శిగా యామాల పెద్ద శ్రీను, ఉపాధ్యక్షుడిగా చింతాడ నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడుగా అరసాన నవీన్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాడ నూకరాజు, దూలపల్లి వెంకటరమణ, పూసపల్లి వెంటరమణ అభినందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ కాంతులు



జములపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ కాంతులు వచ్చాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. సోమవారం జములపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన లబ్ధిని తెలియజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హులందరికీ సచివాలయాల ద్వారా పథకాలు అందుతున్నాయని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పచ్చచొక్కాల నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తమది చేతల ప్రభుత్వమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి అప్పారావు, మాజీ సర్పంచ్ దడాల కొండమ్మను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- పెద్దాపురంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'



గృహస్తుతో మాట్లాడుతున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దాపురం పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలో 26వ వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయరు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఆ వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గ, సచివాలయ సిబ్బందితో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు పట్టణంలోని గడపగడపను సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడపగడపకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ పేరింశెట్టి అంబిక, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, బొబ్బిలి హరిబాబు, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, నాగబోయిన రాజుబాబు, తాటికొండ అచ్చిరాజు, చింతా శ్రీ.నివాసరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీఓగా రాజబాబు బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా బండే రాజబాబు సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏపీఓగా కొనసాగిన స్వామి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యు.కొత్తపల్లి మండల ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న రాజబాబుకు పెద్దాపురం మండల ఏపీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఎఫ్ఏసీ ఏపీఓగా బాధ్యతలు చేపట్టారు.

యోగా, జ్ఞానంతో మానసికోల్లాసం



పెద్దాపురం గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: యోగా, జ్ఞానం చేయడం ద్వారా ప్రతీ విద్యార్థికి మరింత మానసికోల్లాసం ఉంటుందని సమ్మర్ క్యాంప్ ఉపాధ్యాయురాలు వాడపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం యోగాసనాలు నేర్పించారు.. ఈ సందర్భంగా సుమారు 30 మంది విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వేసవి శిబిరంలో విద్యార్థులతో గ్రంథాలయాధికారిణి, ఉపాధ్యాయురాలు

హక్కులపై అవగాహన పెరగాలి

సామర్లకోట: మహిళ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెరగాలని స్థానిక గ్రంథాలయాధికారిని బందిల రత్నమణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా సోమవారం సీనియర్ ఉపాధ్యాయురాలు బుర్ర అరుణసూర్య దిశా చట్టంపై అవగాహన కల్పించారు. వేసవి శిబిరానికి రత్నమణి అధ్యక్షత వహిస్తూ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొవాలన్నారు. మంగళవారం నుంచి విద్యార్థులకు చెస్‌లో శిక్షణ ఇస్తామని చెప్పారు.

విద్యా వ్యవస్థలో
విప్లవాత్మక మార్పులు



జ్యోత్స్నను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన దడాల జ్యోత్స్న 589 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలవడంతో రమణక్కపేటలోని ఆమె స్వగృహం వద్ద సోమవారం ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమెకు రూ.10 వేలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా తయారయ్యాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని అన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలను ఉన్నత స్థాయి స్థితికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా సౌకర్యాల కల్పన జరుగుతుందన్నారు. దీనితో ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థిని జ్యోత్స్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి లోడా అప్పలరాజు, మాజీ సర్పంచ్ మేరుగు ఆనంద్, మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి భావనారాయణరెడ్డి, సర్పంచులు పాలాని దొరబాబు, పులి జయబాబు పాల్గొన్నారు.

ఎంపీడీఓల శిక్షణ ప్రారంభం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓలుగా ఎంపికైన 40 మందికి స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో శిక్షణ సోమవారం పునఃప్రారంభమైంది. వీరికి ఈ నెల 1న శిక్షణ మొదలైంది. ఇటీవల నాలుగు రోజుల సెలవుల అనంతరం ఈ శిక్షణ తిరిగి ప్రారంభమైంది. వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, జీవీ శ్రీదేవి, వెంకటేశ్వరావు, బి.ఆంజనేయులు, పి.ప్రసాద్ శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, మండల పరిషత్ సమావేశాలు, బడ్జెట్ తయారీ, అత్యవసర పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, జీఓలపై వీరికి అవగాహన కల్పిస్తున్నారు. వీరికి ఆరు నెలల పాటు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే వీరు బాపట్ల ఈటీసీలో నెల రోజుల పాటు శిక్షణ పొందారు. ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

నవరత్నాలపై దృష్టి సారించాలి



సామర్లకోట టీటీడీసీలో శిక్షణకు హాజరైన ఆర్పీలు

సామర్లకోట: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రీసోర్సుపర్సన్లు (ఆర్పీలు) నవరత్నాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రీసోర్సుపర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)లో మున్సిపాలిటీ పరిధిలోని 45 మంది ఆర్పీలకు మొదటి రోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. నవరత్నాలలోని పథకాలను ఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన నవరత్నాలు అర్హులకు అందే విధంగా చూడాలన్నారు. చేయూత, ఆసరా, జగనన్న తోడు పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి సాధించడం ద్వారానే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని చెప్పారు. దీనిలో భాగంగా మెప్మా కార్యకలాపాలపై ప్రతీ ఆర్పీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, సీఓలు ప్రసాద్, నరేష్, ఈశ్వర సంతోష్, ఆర్పీలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దొరబాబు

సామర్లకోట: గత నెల 4వ తేదీన పెదపూడి గ్రామంలోని బాణసంచా తయారీ షాపులో పని చేస్తూ మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం పరామర్శించారు. బాణసంచా తయారు చేస్తున్న సమయంలో అగ్నిప్రమాదం సంబవించడంతో స్థానిక పెన్షన్ లైనుకు చెందిన పల్లపాటి శేషారావు, డోకుబుర్ర రాజేష్ మృతి చెందిన విషయం విదితమే. దాంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేలు చొప్పున సహాయం అందజేశారు. ఇల్లులేని వారికి ఇళ్లు కట్టుకునే విధంగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మృతుల పిల్లల చదువు విషయంలో ఉన్నత చదువులు చదువుకునే విధంగా భరోసా ఇచ్చారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ కానేటి రాజేశ్వరీ, సోషల్ మీడియా పెద్దాపురం నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, వేట్లపాలెం వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాలచర్ల సాయిబాబా పాల్గొన్నారు.

యువకుడి మృతి

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నాగులాపల్లి గ్రామానికి చెందిన కూనిశెట్టి రాజశేఖర్ రెడ్డి (27)ఈ నెల 6వ తేదీన ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డికి గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

అరువు ఇవ్వలేదని దాడి

కొత్తపల్లి: ఓ దుకాణ యజమానిని గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. కొత్త ఇసుకపల్లికి చెందిన పబ్బినీడి శేఖర్ ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో కిళ్లీ షాపు నిర్వహిస్తున్నాడు. ఉప్పాడకు చెందిన గరికిన చిన్నతో పాటు మరికొందరు ఆదివారం సిగరెట్లు అరువు ఇవ్వాలని అడగగా శేఖర్ నిరాకరించాడు. దీంతో చిన్న మరికొంతమందితో వచ్చి శేఖర్‌ను గాయపరచి దుకాణం సామగ్రిని ధ్వంసం చేశాడు. ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

చెండాడిన మేర్తాండుడు

- రోహిణి కార్తె రాక ముందే నిప్పులు
- మండే ఎండలకు హడలిపోతున్న ప్రజలు



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లై ఓవర్ బ్రిడ్జి

సామర్లకోట/కొత్తపల్లి: ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే ఎండలు ప్రారంభం అయ్యాయి. మే నెల కావడంతో ఎండలు మండి పోతున్నాయి. రెండు రోజుల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసినా ప్రజలు అంతగా పట్టించుకోలేదు. రోహిణికి ముందుగానే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు, ఉద్యోగులు, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఎండలో తిరగనిదే పనులు జరగని పరిస్థితి ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. సాయంత్రం ఆరు అయినా ఎండ వేడి తగ్గక పోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. మండుతున్న వేసవిలోనే పెళ్లిముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో వాటికి హాజరయ్యే వారు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఎండలకు తోడుగా వడగాడ్పులు వీయడంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోయారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలంలో కరెంటు కోత లేకుండా చర్యలు తీసుకోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపుల లోనికి నేరుగా ఎండ వస్తుంది. దాంతో ఆయా షాపులవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మహిళలు చీర కొంగు తలపై వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ప్రజలు వారి పనులు పూర్తి చేసుకోవడానికి ఎండను లెక్క చేయకుండా వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల పండ్ల జ్యూస్‌లు, చెరుకు, కొబ్బరి బొండాలు ఎక్కువగా సేవిస్తున్నారు. దాంతో వేసవిలో వాటికి డిమాండ్ పెరిగింది. ఎండలకు భయపడి ప్రజలకు రోడ్లపైకి రాక పోవడంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పిఠాపురం నియోజకవర్గంలో పగటి ఉష్ణోగ్రతలు సుమారు 45 డిగ్రీలు దాటాయి. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.



భానుడి తాపానికి చీర కొంగులను తలపై వేసుకొని వెళుతున్న మహిళలు



వెలవెలబోతున్న ఉప్పాడ- పిఠాపురం రోడ్డు